


# సలాం

## నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల



1972, జనవరి 21.

ఆరోజే నేను త్రివేండ్రంలో విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్లో కొత్తగా ఉద్యోగంలో చేరింది. అలా అక్కడ పదేళ్ళు - మొదట్లో ఇంజనీరుగా, తర్వాత సీనియర్ ఇంజనీరుగా, ఆ తర్వాత మేనేజర్‌గా ఆ వూళ్ళోనే వున్నాను.

నాకు త్రివేండ్రం అంటే ఎంతో ఇష్టం. చక్కటి వూరు. ఎంతో స్నేహపూరితంగా వుండే మలయాళీలు. ఇండియాలో నూటికి నూరుపాళ్ళు చదువుకున్నవాళ్ళున్న మొట్టమొదటి రాష్ట్రం. చక్కటి సముద్ర తీరం. అతి సుందరమైన ప్రదేశం.

నేను అక్కడ ఉద్యోగంలో చేరిన కొత్తల్లోనే, ఈయన తరచూ నాకు ఎదురుపడుతూ వుండేవాడు. కొన్ని మీటింగుల్లోనూ కలుస్తూ వుండేవాళ్ళం. తర్వాత ఎస్ఎల్వీ-3 (శాటిలైట్ లాంచ్ వెహికిల్-3) ప్రాజక్ట్ మొదలు పెట్టటం, దానికి ప్రాజెక్ట్ మానేజర్‌గా ఈయన్ని నియమించటం జరిగింది.



చిత్రం: డా.దారా సురేంద్ర

ఒక పల్లెటూళ్ళో రెడ్డిగారి పార్టీకీ, నాయుడుగారి పార్టీకీ పోట్లాట జరుగుతున్నదిట. రెండు పార్టీల వాళ్ళూ, ఈనాటి మన తెలుగు సినిమాల్లోలా, కత్తులు పెట్టి ఒకళ్ళనొకళ్ళు నరుక్కుంటున్నారు. తలకాయలు ఎగిరిపోతున్నాయి. చుట్టుపక్కల అందరూ, మన సెన్సార్ వాళ్ళల్లా కళ్ళప్పగించి చూసి ఆనందిస్తున్నారు గానీ, ఆపటానికి ప్రయత్నాలేవీ చేయటం లేదు. చేతులూ కాళ్ళూ రక్తసిక్తమై నేలపాలవుతున్నాయి. అయినా రచ్చబండ క్రింద, తాపీగా చుట్ట తాగుతూ కూర్చున్నాడు అతను. ఆ రెండు పార్టీల వాళ్ళు అతని జోలికి మాత్రం రావటం లేదు. ఎందుకంటే అతను అప్పారావు కనుక. రెండు వర్గాలవారికి అప్పున్నాడు కనుక. అతన్ని ముట్టుకుంటే, తమ పని గోవింద కొడుతుంది కనుక.

మా స్పేస్ సెంటర్‌లో కూడా అన్ని ప్రభుత్వ కంపెనీల్లోలాగానే రాజకీయాలు. బంధుప్రీతి. ఎక్స్‌ట్రా. మీకు తెలీందేముంది. పదవీ వ్యామోహాలతో, తమ తమ పద్మవ్యూహాలతో యధాశక్తి వివిధ డైరెక్టారాసురులు తమ వంతు ఉడతాభక్తితో సాయపడుతుండేవారు. ఎవరు ఎంత కొట్టుకున్నా, ఈయన్ని మాత్రం ముట్టుకునే వాళ్ళు కాదు. ఈయన వాళ్ళందరి దగ్గరా అప్పులు తీసుకున్నాడని చెప్పటం లేదు. సందర్భానికి తగ్గ జోకు కాబట్టి ముళ్ళపూడి వారి అనుమతి లేకుండా అది వ్రాశాను. ఆ ప్రాజెక్ట్ నడుస్తునంత కాలం, ఈయన రాత్రింబగళ్ళూ ఆఫీసులోనే వుండి ఎంతో సమర్ధవంతంగా, అలుపూ సొలుపూ పైకి కనపడనీయకుండా, తన జీవితాన్ని భారత అంతరిక్ష పరిశోధనకి అంకితం చేసి పనిచేస్తుండేవాడు. తనతో పనిచేసే వారిని ఎంతో మర్యాదగా చూస్తుండేవాడు. మధ్యే మధ్యే కొన్ని లాంచింగులూ, టెస్టులూ. అవి విజయవంతమైతే.... 'అవునండీ... మేమే అది చేసింది' అని కాలరెత్తుకునేవాళ్ళందరూ. అదే కనుక ఫెయిలయితే... మీకు తెలుసు ఆ జవాబేమిటో!

ఈయన చేతుల్లో ఎస్.ఎల్.వీ. ప్రాజెక్ట్ ఎంత విజయవంతమయిందో, భారతదేశ అంతరిక్ష ప్రయోగాలు అంతరిక్షమంత ఎత్తున విజయవంతమయాయి. ఈనాటి టీవీ, టెలిఫోన్ అందరికీ అందుబాటులోకి రావటానికి అది నాంది అని చెప్పవచ్చు.

తర్వాత దేశరక్షణ కోసం జరిగే ప్రయోగాలని ఎంతో సమర్ధవంతంగా నడిపించి, ఆ విభాగంలో దేశాన్ని ముందుకు నడిపించటంలో ముఖ్యపాత్ర వహించిందీ ఈయనే. అగ్ని, పృధ్వి, ఆకాష్, నాగ్, త్రిశూల్ మొదలైన రక్షణ యంత్రాంగంతో దేశ సంక్షేమాన్ని కట్టుదిట్టం చేసిన దిట్ట.

ప్రపంచంలోని మేధావి వర్గమే కాకుండా, సామాన్యులు కూడా సంతోషించిన విషయం - భారతదేశానికి మొట్టమొదటిసారిగా రాష్ట్రపతి, ప్రధానమంత్రీ ఇద్దరూ మేధావులే కావటం. చదువూ సంస్కారాలకి ఒకేసారి పట్టం కట్టటం. గూండా రాజకీయాలతో, అవినీతీ లంచాలతో కుళ్ళిపోయిన రాజకీయ నాయకులతో, విసుగెత్తిన వాళ్ళకి ఇదో ఆటవిడుపు. మరి రాష్ట్రపతి పదవి నామమాత్రమే అయిన మన రాజ్యాంగంలో, ఈయనలాటి ముందుచూపు మనిషీ, కార్యదీక్షాపరుడూ ఏం చేయగలడు? ఏమీ విలువలు లేని వ్యక్తుల చేత నడపబడుతున్న మన రాజకీయ యంత్రాంగం ఏం చేయనిస్తుంది? అనే ప్రశ్న, మీ అందరితో పాటూ నాకూ వచ్చింది.

1931లో బ్రిటిష్ ఇండియాలోని రామేశ్వరం అనే హిందూ పుణ్యక్షేత్రంలో ఒక మధ్య తరగతి ముస్లిం కుటుంబంలో పుట్టి, మతం కన్నా మానవత్వానికి విలువనిచ్చిన అవల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం, అంతరిక్ష శాస్త్రంలోనూ, దేశరక్షణ యంత్ర నిర్మాణంలోనూ ఎంతో ఎదిగి పద్మభూషణుడవుతాడని అతను సామాన్య కుటుంబంలో పెరుగుతున్నప్పుడు ఎవరూ అనుకోలేదు. అంతేకాదు త్రివేండ్రంలో ఇరవై నాలుగు గంటలూ తన పనేదో తను చేసుకుపోయే అంతరిక్ష శాస్త్రవేత్త భారతరత్న అవుతాడని కలలో కూడా ఎవరూ ఊహించి వుండరు.

కలాం పెరిగిన వాతావరణం కూడా చిన్నతనంలోనే ఆయనలో ఎన్నో పెద్ద పెద్ద భావాలను వెలికితీసింది. రామేశ్వరం గుడికి వాళ్ళ ఇల్లు చాల దగ్గర. కలాం నాన్నగారికి ప్రాణ స్నేహితుడు, రామేశ్వరం గుడి ప్రధాన పూజారి పక్షి లక్ష్మీనారాయణశాస్త్రిగారు. వారిద్దరూ హిందూ ముస్లిం వేదాంతాల గురించి మాట్లాడుకుంటుంటే ఈయన వింటూ వుండేవారుట. అలా తన తండ్రి దగ్గర నేర్చుకున్న జీవిత సత్యాలే, తర్వాత తన శాస్త్ర విజ్ఞాన శోధనలో ఎంతో ఉపయోగపడ్డాయంటారు కలాం.

అంతేకాదు తిరుచిరాపల్లి సైంట్ జోసెఫ్ కాలేజీలో చదివేటప్పుడు ఈయనతో పాటూ హాస్టల్ గదిలో వుండేది శ్రీరంగం నుంచి వచ్చిన ఒక అయ్యంగార్, కేరళనించీ వచ్చిన ఒక సిరియన్ కాథలిక్. తన కాలేజీలో చాలమంది కంచి శంకరాచార్య దగ్గర శిష్యరికం చేసేవారుట. అక్కడే తను 'ఇవ్వటంలో వున్న ఆనందాన్ని' చూడటం అలవాటు చేసుకున్నానన్నారు.

రకరకాల సందర్భాలలో రాష్ట్రపతిగా ఆయన ఇచ్చిన ఉపన్యాసాలు, ఇటు పిల్లలకీ, అటు యువతరానికీ, సామాన్య భారత పౌరులకీ, విశ్వ మానవ సమాజానికీ ఉత్తేజకరమైన సందేశాలు.

అన్ని రాజకీయ పార్టీలచేతా, నాయకులచేతా గౌరవం సంపాదించుకున్న మనిషి.

2020వ సంవత్సరానికల్లా భారత దేశాన్ని, ప్రపంచ శాస్త్ర విజ్ఞాన, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ముందు బెంచీల్లో చూడాలని కలలుగన్న దేశభక్తుడు.

ఆయన చేసిన ప్రసంగాల్లో నాకు బాగా నచ్చినది మీతో పంచుకోవాలని వుంది. దాని సారాంశం 'నువ్వు' అనే పేరుతో నా 'ఎన్నారై కబుర్లు'లో వ్రాశాను. ఆ వ్యాసంలోని ముఖ్యమైన విషయాలను మరోసారి నెమరు వేసుకుందాం.

ఇక్కడ 'నువ్వు' అంటే నువ్వూ, నేనూ, మనమందరమూ అని అనుకుంటూ చదువుదాం!

నువ్వు మన గవర్నమెంట్ అసమర్థమైనదనీ, దేనికీ పనికిరానిదనీ అంటావు. నువ్వు మన న్యాయవాద వ్యవస్థ చాల పురాతమైనదంటావు. మన ఇంటి ముందర చెత్తని మునిసిపాలిటీ అసలు తీయనే తీయదంటావు. మన ఫోన్లు సరిగ్గా పనిచేయవంటావు. రైళ్ళు ఒక జోక్ అంటావు. మన విమాన సర్వీసు ప్రపంచంలోనే పరమ చెత్తంటావు. ఉత్తరాలని బట్వాసురుడు దారిలోనే మింగేస్తాడంటావు. మన దేశాన్ని కుక్కల పాలు చేశారంటావు. దేశం రొచ్చుగుంటలో వుందంటావు. నువ్వు ఇంకా ఇలా చాల అంటుంటావు.

కానీ నువ్వేం చేస్తున్నావు?

సింగపూర్ వెళ్ళినప్పుడు అక్కడ ఎంతో చక్కగా హుందాగా ప్రవర్తిస్తావు. అక్కడ నువ్వు సిగరెట్ పీకలు రోడ్డు మీద పారెయ్యవుగాక పారెయ్యవు. షాపుల ముందర చిల్లర తిండ్లు తింటూ కూర్చోవు. నువ్వు దుబాయ్ వెడితే, రంజాన్ సమయంలో బయట ఏమీ తినటానికి అక్కడ ధైర్యం చాలదు. నువ్వు జెడ్డాకి వెడితే, అందరితో పాటూ తలకి జేబురుమాల కట్టుకుంటావు. నువ్వు లండన్‌లో వుంటే, అక్కడ టెలిఫోన్ ఎక్స్చేంజ్‌లో ఎవడికో డబ్బులిచ్చి నీ టెలిఫోన్ బిల్లు ఇంకొకడికి అంటగట్టవు. నువ్వు వాషింగ్టన్లో రోడ్డు మీద స్పీడుగా వెడుతున్నప్పుడు పోలీసు పట్టుకుంటే, అతన్ని చూసి 'నేనెవరో తెలుసా! మా బాబుతో చెబుతా!' అని కాలరెగరెయ్యవు.

నువ్వు ఆస్ట్రేలియాలోనో, న్యూజిలాండ్‌లోనో బీచ్ ఒడ్డున వుంటే, కొబ్బరిపీచుని గార్బేజ్ డబ్బాలో తప్ప ఎక్కడ పడితే అక్కడ పారెయ్యవు. నువ్వు టోక్యోలో వుంటే నీ నోట్లోని కారా కిళ్ళీ ఉమ్మిని రోడ్డు మీద తుపుక్కున ఉమ్మేయవు. బాస్టన్‌లో వుంటే పరీక్షల్లో మార్కులు వేయించుకుని డిగ్రీలు కొనుక్కోవు.

మనమింకా నీ గురించే మాట్లాడుకుంటున్నాం.

నువ్వు విదేశాలకి వెడితే, అక్కడి కట్టుబాట్లనీ, నియమాలనీ, నిబంధలనీ విధిగా పాటిస్తావు. అదే నువ్వు, నీ దేశంలో ఎందుకు పాటించవు? మాతృగడ్డపై కాలు పెట్టగానే ఎక్కడపడితే అక్కడ కాగితాలు పారేస్తావు. సిగరెట్ పీకలు విసిరేస్తావు. ఇంకోచోట సరిగ్గా వున్నవాడివి, ఇక్కడ ఎందుకిలా అయిపోతున్నావ్?

ఎలక్షన్లలో ఓటు వేశాక అసలు గవర్నమెంట్ సంగతే మరిచిపోతావు. (ఓటు కూడా ఎంతమంది వేస్తున్నారు. వేసేవాళ్ళల్లో ఎంతమంది న్యాయబద్ధంగా వేస్తున్నారు అనేది ఒక ప్రశ్న) కుర్చీలో వెనక్కి ఆనుకుని కూర్చుని గవర్నమెంటే అంతా చేయాలని అంటూ నువ్వు మాత్రం నోటికి పని చెప్పి తిడుతూ కూర్చుంటావు.

గవర్నమెంట్ రోడ్లు శుభ్రం చేయటం లేదంటావు. అలా అంటూనే రోడ్ల మీద చెత్త నువ్వే పోస్తుంటావు. మన రైళ్ళల్లో మరుగు దొడ్లు శుభ్రంగా లేవని తిడుతుంటావు. అంటూనే వాటిని నువ్వే పాడు చేస్తుంటావు.

ఇక్కడ నువ్వు అంటే ఆ సేవలని అందుకునే నువ్వూ, నేనూ, మనలాటి వాళ్ళు మాత్రమేనని కాదు. అవి శుభ్రం చేయవలసిన సిబ్బంది వర్కర్లనించీ ఆఫీసర్ల దాకా అందరూను.

ఇలాటివే కాదు. మన సాంఘిక సమస్యల్లో కూడా ఇంతే. కట్నాలూ, చిన్నపిల్లల వివాహాలూ లాటి స్త్రీల సమస్యలు చూద్దాం. సభలు పెట్టి దేశం పాడయిపోయింది మాష్టారూ అని ఉపన్యాసాలిస్తాం. ఇంటికి వచ్చి, ఆ కట్నాలేవో మన అబ్బాయికి మనమే తీసుకుంటాం. 'మొత్తం సంఘమంతా కుళ్ళిపోయింది. నేనొక్కడినీ కట్నం తీసుకోకపోతే ఈ వ్యవస్థ మారుతుందా?' అని ఒక కుంటిసాకు కూడా చెబుతాం.

అయితే ఈ వ్యవస్థని మార్చేదెవరు? ఇంతకీ ఈ వ్యవస్థలో వున్నదెవరు?

ఈ వ్యవస్థలోనా... మా పక్కింటి వాళ్ళూ, ఆ పక్కింటి వాళ్ళూ, ఎదురింటి వాళ్ళూ. నగరాలూ, పట్టణాలూ, ప్రజలూ, ప్రభుత్వమూనూ. నేను మాత్రం కాదు.

కబుర్లు మానేసి అసలు పనులు చేయవలసిన సందర్భం వచ్చినప్పుడు మాత్రం, మన గూడులోకి మనం వెళ్ళిపోయి, ఎవరో ఎక్కడినించో ఊడిపడతాడనీ, మనల్ని ఉద్ధరిస్తాడనీ ఆశ పెట్టుకుని ఎదురు చూస్తాం. కానీ అంతకన్నా ఏమీ చేయం.

అలా కాకపోతే, మన దేశం వదిలి ఇంకో దేశానికి పారిపోతాం. ఏ అమెరికాకో పారిపోయి అక్కడి నిబంధనలు పాటిస్తూ బ్రతుకుతాం. న్యూయార్క్‌లో బ్రతకటం కష్టమయితే లండన్‌కి పారిపోతాం. అక్కడ నిరుద్యోగం వస్తే గల్ఫ్ దేశాలకి పారిపోతాం. అక్కడ కూడా ఏ యుద్ధమో వస్తే, మన గవర్నమెంట్ మనల్ని రక్షించి ఇండియాకి తీసుకుపోలేదని గొడవ చేస్తాం.

ప్రతివాడికీ తిట్టటానికే దేశం వుంది. ఇలా మానభంగం చేయటానికే దేశం వుంది. దేశం కోసం మనమేదన్నా చేయాలీ అన్న - ఆలోచన ఎవరికీ లేదు. మనం, మన ఆలోచనలూ, మన అంతరాత్మా అనీ డబ్బుతోనే ముడిపడి వున్నాయి మరి.

'ఇండియాకి నువ్వేం చేయగలవు అని నిన్ను నువ్వే అడుగు. అమెరికా తదితర దేశాల్లా ఇండియా తయారవాలంటే నేనేం చేయాలి అని ప్రశించుకో' అంటారు కలాం.

ఈ ఉపన్యాసం కలాం రాష్ట్రపతి కాక మునుపు ఇచ్చింది. ఆయన పెట్టినవి చివాట్లు అనాలో, మేల్కొలుపు అనాలో కానీ చాలమందిని కదిలించింది. ఇండియాలోనే కాదు. ప్రపంచంలో అన్ని చోట్లా. ఇంటర్నెట్లో ఇంకా దశదిశలా ప్రతిధ్వనిస్తూనే వుంది. నాకు

ఆయన ప్రసంగ వ్యాసాన్ని ఈమెయిల్ ద్వారా తూర్పు ఆఫ్రికా నించీ భారతీయుడు కాని ఒక వ్యక్తి పంపించాడంటే, ఈ వ్యాసం ఎంతమందిని ఎలా స్పందింప చేసిందో అర్థమవుతున్నది.

అందుకే ఇది చెప్పటం నా బాధ్యత అనిపించి చెబుతున్నాను.

మనం రోజూ కాఫీ తాగేటప్పుడూ, తాగనప్పుడూ, గాయత్రీ మంత్రంలా మననం చేసుకోవలసిన వేదార్థం వుందాయన మాటల్లో!

అందుకే ఆయనకి నా సలాం!

*తన తల రాతను తనే మార్చగల అవకాశాన్నే వదులుకుని*
*తనలో భీతిని తన అవినీతిని తన ప్రతినిధులుగ ఎన్నుకుని*
*ప్రజాస్వామ్యమని తలచే జాతిని ప్రశ్నించడమే మానుకుని*
*కళ్ళు ఉన్న ఈ కబోది జాతిని నడిపిస్తుందట ఆవేశం*
*ఆ హక్కేదో తనకే ఉందని శాసిస్తుందట అధికారం*
*కృష్ణుడు లేని కురుక్షేత్రమున సాగే ఈ ఘోరం*
*చితిమంటల సిందూరం*
*చూస్తూ ఇంకా నిదురిస్తావా విశాల భారతమా*
*.ఓ విషాద భారతమా..!*

— సిరివెన్నెల సీతారామ శాస్త్రి